## నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలి

**రంగారెడ్డి కలెక్టర్ శశాంక**



రంగారెడ్డి, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) : వేసవిలో నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో అందించే నీటి సరఫరాపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి నీటి సరఫరాపై పలు సూచనలు చేశారు. వేసవి ప్రారంభమైన దృష్ట్యా నీటి ఎద్దడి తలెత్తే అవకాశమున్న ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి ప్రణాళికాబద్ధంగా నీరు క్రమం తప్పకుండా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. గత సంవత్సరం నీటి ఎద్దడిని ఎదుర్కొన్న ప్రాంతాల్లో సమస్య పునరావృతం కాకుండా చూడాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తగు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. లీకేజీ వంటి సమస్యలు తలెత్తకుండా పైప్ లైన్ మరమ్మతులు చేపట్టాలని, కొత్త పైప్ లైన్ కనెక్షన్లు ఇవ్వటం, వెంటనే బోర్ల మరమ్మతులు, ఫ్లషింగ్ చేయించాలని ఆదేశించారు. అధికారులందరూ బాధ్యతగా పని చేయాలని, సమష్టిగా పని చేసి వేసవిలో నీటి సమస్యలు లేకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, మిషన్ భగీరథ ఎస్ఈ ఆంజనేయులు, పీఆర్ ఎస్ఈ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## టెలికాం వినియోగదారులకు ట్రాయ్ అవగాహన సదస్సు



ట్రాయ్ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

ఆదిబట్ల, ఫిబ్రవరి 29 : దేశంలో టెలికాం అభివృద్ధిలో ట్రాయ్ పాత్ర మరువలేనిదని ట్రాయ్ అడ్వైజర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీ పటేల్‌గూడలోని విశ్వేశరయ్య ఇంజినీరింగ్ కళాశాలలో టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) ఆధ్వర్యంలో వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ట్రాయ్ అన్ని ఆపరేటర్స్‌ను పారదర్శకంగా చూస్తుందని పేర్కొన్నారు. భారతదేశంలో 118.57 కోట్ల టెలికాం వినియోగదారులు ఉన్నారని.. టెలి సాంద్రత 84.97 శాతం ఉందని.. 88.1 కోట్ల ఇంటర్‌నెట్ వినియోగదారులు ఉన్నారని.. ఇప్పటివరకు 91.4 కోట్ల మంది నెంబర్ మారకుండా వేరే ఆపరేటర్స్‌కు మారారన్నారు. ఇప్పటికీ దేశంలో ప్రతి ఒక్కరూ టెలికాం వినియోగంపై పూర్తిగా ఆధారపడి ఉన్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ అడ్వైజర్ సురేశ్‌బాబు, కళాశాల చైర్మన్ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ రమేశ్, ట్రాయ్ సీఏజీ మెంబర్స్, ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్, జియో, వోడా, ఐడియా, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# అవిశ్వాసంలో నెగ్గినా..

- ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ ఎంపికపై కాంగ్రెస్‌లో కొనసాగుతున్న ఆధిపత్య పోరు
- నిరంజన్‌రెడ్డిని చైర్మన్‌గా ఎన్నుకోవద్దని కాంగ్రెస్‌లో మరో వర్గం వాదన
- ఎట్టకేలకు కోర్టును ఆశ్రయించిన కాంగ్రెస్ బహిష్కృత నేత నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 29 : రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ ఎంపికపై కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు కొనసాగుతున్నది. గతంలో ఉన్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాంగ్రెస్‌లోనే ఉన్నప్పటికీ మరో కాంగ్రెస్ నేత నిరంజన్‌రెడ్డి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లతో గత నెలలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. సొంత పార్టీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టవద్దంటూ కాంగ్రెస్‌లో ఓ వర్గంతోపాటు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా అడ్డుకున్నారు. అయినప్పటికీ నిరంజన్‌రెడ్డికి కాంగ్రెస్‌లో ఓ వర్గంతోపాటు బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు మద్దతు ఇచ్చారు. దీంతో చైర్‌పర్సన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంలో నిరంజన్‌రెడ్డి వర్గీయులు విజయం సాధించారు. అప్పటి చైర్‌పర్సన్ ఆర్థిక పదవిని కోల్పోవాల్సి వచ్చింది. వైస్ చైర్‌పర్సన్‌పై కూడా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి నెగ్గారు. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. ఎట్టి పరిస్థితిలోనూ నిరంజన్‌రెడ్డి చైర్మన్ కాకూడదని కాంగ్రెస్‌లో ఓ వర్గంతోపాటు ఎమ్మెల్యే కూడా పట్టుబడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరింపబడ్డ నిరంజన్‌రెడ్డి చైర్మన్‌గా ఎన్నిక కాకూడదని వారి వాదన. ఈ విషయమై నిరంజన్‌రెడ్డి పలుమార్లు ఎమ్మెల్యేను కలిసినప్పటికీ సరైన స్పందన రాలేదు. దీంతో నిరంజన్‌రెడ్డి కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆదిబట్ల మున్సిపల్ వ్యవహారం మరోసారి తెరమీదకు వచ్చింది.



విద్యుత్ దీపాల వెలుగుల్లో ఎల్లమ్మ దేవాలయం

## ఘనంగా ప్రారంభమైన ఎల్లమ్మ జాతర

**పోలేపల్లి గ్రామం నుంచి ఆలయం వరకు అమ్మవారి ఊరేగింపు**

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 29 : దుద్యాల మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ జాతర గురువారం ఘనంగా ప్రారంభమైంది. పోలేపల్లి గ్రామంలోని ఎల్లమ్మ గుడి నుంచి జాతర నిర్వహించే ప్రధాన దేవాలయం వరకు అమ్మవారిని ఊరేగింపుగా తీసుకురావడంతో ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం రాత్రి గ్రామంలోని ఎల్లమ్మ గుడిలో ఉన్న అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ఆలయ చైర్మన్ జయరాములు, మేనేజర్ రాజేందర్ రెడ్డి, కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహాన్ని పల్లకీలో ఉంచి బ్యాండు మేళాలు, బాజా భజంత్రీలు, డప్పుచప్పుళ్ల మధ్య ప్రధాన దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా ఎల్లమ్మ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. జాతర ఆవరణలో దుకాణాలు వెలిశాయి.

### నేడు సిడె

ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన సిడె కార్యక్రమం శుక్రవారం సాయంత్రం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి దేవస్థానం కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. సిడె కార్యక్రమాన్ని తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోలేపల్లికి చేరుకుంటున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా మరమ్మతులు చేపట్టారు.



జాతరలో వెలిసిన దుకాణాలు

## పశువులకు నేటి నుంచి
# గాలికుంటు టీకాల పంపిణీ



ఇబ్రహీంపట్నంరూరల్ : మూగజీవాలకు టీకాలు వేస్తున్న పశసంవర్ధకశాఖ సిబ్బంది (ఫైల్)

ఇబ్రహీంపట్నంరూరల్, ఫిబ్రవరి 29 : గాలికుంటు వ్యాధి నుంచి మూగజీవాలను కాపాడేందుకు ప్రతి ఏటా రెండుసార్లు ప్రభుత్వం ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలను అందజేస్తున్నది. అందులో భాగంగానే శుక్రవారం నుంచి ఈ నెల 30 వరకు రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఉన్న 2.85 లక్షల ఆవులు, ఎద్దులు, గేదెలు, దూడలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మారుతున్న వాతావరణ పరిస్థితుల నుంచి మూగజీవాలను కాపాడడం కోసం ప్రభుత్వం ముందస్తు చర్యలను చేపట్టింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేసి టీకాలు వేయడం కోసం ఏర్పాట్లు చేసింది. గాలికుంటు వ్యాధి టీకా వేయించకపోవడంవల్ల కలిగే అనర్థాలను కూడా రైతులకు వివరించి వారిలో చైతన్యం తీసుకువచ్చి ఆరు నెలలు దాటిన దూడల నుంచి అన్ని పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గాలికుంటు వ్యాధి టీకా వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. లక్షల రూపాయలు వెచ్చించి పాడి పశువులను కొనుగోలు చేస్తున్నప్పటికీ.. వాటి ఆరోగ్య బాధ్యత కూడా రైతుల పైనే ఉన్నందున రైతులంతా ముందుకొచ్చి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించుకోవాలని పశుసంవర్ధకశాఖాధికారులు కోరుతున్నారు. సుమారు నెల రోజులపాటు టీకాలు వేసే కార్యక్రమం చేపడుతున్నారు. ఇందు కోసం పశుసంవర్ధకశాఖాధికారులకు, సిబ్బందికి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ప్రతి మండలానికి రెండు టీంల చొప్పున టీకాలు వేసే కార్యక్రమం నేటి నుంచి ప్రారంభమై ఈ నెలాఖరు వరకు కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు.

### గాలికుంటును తరిమికొడదాం

**వికారాబాద్ జిల్లా పశువైద్య, సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ అనిల్‌కుమార్**



వికారాబాద్: గోవు, గేదె జాతి పశువుల్లో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం మార్చి నెలాఖరు వరకు నిర్వహించనున్నట్లు వికారాబాద్ జిల్లా పశువైద్య, సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ అనిల్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రణాళిక ప్రకారం జిల్లాలో 54 బృందాలతో మండలానికి 2-3 బృందాల చొప్పున ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న 1,38,092 గోవు జాతి, 65,588 గేదె జాతి పశువుల్లో 3 నెలల వయసు పైబడిన పశువులన్నింటికీ టీకాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ బృందాలు మండల పశువైద్య అధికారి ఆధ్వర్యంలో ప్రణాళికబద్ధంగా చేపడుతారని పేర్కొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, పశు పోషకులకు ముందస్తుగా సమాచారం అందించి ముందుగా గ్రామాల్లో దండోరా వేయించి నిర్ణయించిన తేదీల్లో అన్ని మండలాలలోని గ్రామాలకు ఉదయాన్నే వెళ్లి టీకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పశు వైద్యులు, సిబ్బంది టీకాలు వేసి దాని గుర్తింపు కోసం భారత్ పశుదాన్ పోర్టల్ ద్వారా చెవిపోగు, పశువు వివరాలు, పశువు యజమాని వివరాలు నమోదు చేస్తారని తెలిపారు. మన రాష్ర్టాన్ని వ్యాధిరహిత రాష్ట్రంగా అంతర్జాతీయ గుర్తింపు సాధించడానికి, పశు ఉత్పత్తుల విలువను పెంచడానికి సహకరించవలసిందిగా జిల్లా పశుపోషకులు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించి, పశువైద్య సిబ్బందికి సహకరించి పశువులను కాపాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### గాలికుంటు వ్యాధి వల్ల కలిగే అనర్థాలు

* గాలికుంటు వ్యాధి క్యాన్సర్ కంటే భయకరమైనదని వైద్యులు చెబుతున్నారు.
* ఈ వ్యాధి సోకిన వెంటనే పశువులకు 104, 105 డిగ్రీల జ్వరం ఉంటుంది.
* నోట్లో పుండ్లు కావడంతో తినడానికి ఇబ్బందికరంగా ఉంటుంది.
* పశువుల గెట్కలలో పుండ్లవుతాయి.
* పాడిపశువులకైతే పాల ఉత్పత్తులు తగ్గిపోతాయి.
* సుడితో ఉన్న పశువులు ఈడ్చుకుపోయే ప్రమాదముంది.
* ఈ వ్యాధి గాలివల్ల సోకుతుంది.
* టీకా వేస్తే వారం రోజుల వరకు కూడా కోలుకునే అవకాశముండదు.
* ముఖ్యంగా సంకర జాతి పశువుల్లో మరణాలు సంభవించే అవకాశముంటుంది.

### వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి



ఆవులు, గేదెలు, ఎద్దులు, దూడలకు వ్యాధులు సోకకుండా ఉండటం కోసం ప్రభుత్వం నేటి నుంచి ఉచితంగా అందించనున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పంపిణీ చేసేందుకు గ్రామాలకు వచ్చే అధికారులకు రైతులు సహకరించి తమ ఆవులు, గేదెలు, దూడలు, ఎద్దులకు టీకాలు వేయించాలి. క్యాన్సర్ కంటే భయంకరమైన గాలికుంటు వ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి. జిల్లా వ్యాప్తంగా ఉన్న 452 గ్రామాల్లో టీకాలు వేసేందుకు 92 టీంలను ఏర్పాటు చేశాం.

**- అంజిలప్ప, జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి**

# ముంపునకు శాశ్వత పరిష్కారం

- ఎస్ఎన్‌డీపీ పనుల పరిశీలించిన ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి
- పనుల్లో వేగం పెంచాలి
- 1వ డివిజన్ పర్యటనలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



ఎస్ఎన్‌డీపీ నాలా పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, ఫిబ్రవరి29: ఎస్ఎన్‌డీపీ నిధులతో చేపడుతున్న నాలా పనులు పూర్తి అయితే ముంపు సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్‌లో వరలక్ష్మీనగర్, సాయిబాలాజీ, సాయి కృష్ణ కాలనీల్లో జరుగుతున్న ఎస్ఎన్‌డీపీ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. నాలా పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి ఎన్ని రోజుల్లో పూర్తి చేసారో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలో ఉన్న సమస్యలను కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముంపు కాలనీల్లో ప్రజా సమస్యలను పరిష్కరించడానికే యుద్ధప్రాతిపాదికన గతంలో నిధులు కేటాయించామని గుర్తు చేశారు.

వర్షం వస్తుందంటేనే ముంపు ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపేవారన్నారు. ఎప్పుడు ఇల్లు ఖాళీ చేయవలసి వస్తుందోనని భయపడేవారన్నారు. అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించానని చెప్పారు.

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పనుల్లో కొంత జాప్యం జరిగిందన్నారు. ఇక నుంచి అలా కాకుండా త్వరగా పనులు పూర్తి చేయించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. పనులు జరుగుతున్న ప్రాంతంలో అధికారుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. వర్షాకాలం లోపు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడ కూడా పనులు పెండింగ్‌లో ఉండకూడదన్నారు. త్వరగా పనులు పూర్తిచేస్తే ముంపు ప్రాంతాల ప్రజలు సంతోషంపడుతారన్నారు. నాలాల కోసం గోతులు తీసి నెలలుగా ఉంచడం వల్ల కాలనీల్లో ప్రజలు ఇబ్బందులు పడుతారన్నారు. అధికారులు త్వరగా పనులు పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. అభివృద్ధి విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, సూర్ణగంటి అర్జున్, బీఆర్ఎస్ నాయకులు పెద్దబావి ఆనందరెడ్డి, సంరెడ్డి వెంకట్‌రెడ్డి, బీమిడి జంగారెడ్డి, అధికారులు, కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

### మీర్‌పేట బీఆర్ఎస్ అధ్యక్షుడిగా బల్‌రాం

మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 28వ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడిగా బల్‌రాంను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్యే సబిత బల్‌రాంకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డివిజన్‌లో ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. గతంలో పార్టీ చేసిన కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో మేయర్ దుర్గాదీప్‌లాల్‌చౌహన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, రాజు, నాగరాజు, వీరరాఘవరెడ్డి, లక్ష్మీసంతోష్ రెడ్డి, మన్మంత్‌రావు తదితరులు ఉన్నారు.



బీఆర్ఎస్ అధ్యక్షుడు బల్‌రాంకు నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సబిత

## భూసేకరణ చేయండి..

**స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్**

# పనుల్లో వేగం పెంచండి



సిటీబ్యూరో, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) /సైదాబాద్ : స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులను జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ ఆదేశించారు. గురువారం ఉన్నతాధికారులతో కలిసి నగరంలో పలు ప్రాంతాలలో పర్యటించారు. తొలుత అంబర్‌పేట ఫ్లై ఓవర్ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల కోసం పెండింగ్‌లో ఉన్న ఆస్తుల సేకరణ వివరాలను సంబంధిత అధికారుల నుంచి కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, అప్రోచ్ రోడ్డులో ట్రాఫిక్ అంతరాయం కలిగించే అపార్ట్‌మెంట్స్ ముందు భాగాన్ని రోడ్డు వైపున స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలైన్‌మెంట్ ప్రకారం ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. క్యాదిరి బాగ్ వద్ద మసీదు పక్కనే ఉన్న చిన్న భాగాన్ని స్వాధీనం చేసుకోవాలని కమిషనర్ చెప్పారు. అంబర్‌పేట మహంకాళి ఆలయం పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇతర చోటికి మార్చాలని, గాంధీ విగ్రహం ఎదురుగా ఉన్న సర్వీస్ రోడ్డుకు అడ్డంగా ఉన్న చిన్న నిర్మాణాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. అక్కడి నుంచి మలక్‌పేట్ నుంచి ఐఎస్ సదన్ వరకు ఫ్లై ఓవర్ పనుల పురోగతిని జోనల్ కమిషనర్ టి.వెంకన్నతో సమీక్షించారు. చంచల్‌గూడ ప్రెస్‌రోడ్, సైదాబాద్ ప్రాంతాన్ని సందర్శించి ఫ్లై ఓవర్ పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ దేవానంద్ తదితరులు పాల్గొన్నారు. సైదాబాద్ పురాతన హనుమాన్ దేవాలయం మీదుగా చేపట్టిన స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనుల అలైన్‌మెంట్ మార్చాలని బీజేపీ నాయకులు సహదేవ్‌యాదవ్, కొత్తకాపు రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, వినయ్‌కిశోర్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు వేయించాలి

**రాష్ట్రస్థాయి అధికారి అజార్**




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్రస్థాయి అధికారి అజార్

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 29 : ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలను తప్పకుండా వేయించాలని రాష్ట్రస్థాయి అధికారి అజార్ అన్నారు. ఈ నెల మూడు నుంచి నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షాద్‌నగర్ డివిజన్‌లో 0-5 ఏండ్ల చిన్నారులు 34,156 మంది ఉన్నారని, వారందరికీ పల్స్ పోలియో చుక్కలు వేసేందుకు డివిజన్‌లో 292 బూత్‌లను ఏర్పా టు చేస్తున్నామన్నారు. అదేవిధంగా 29 రూట్లలో వాహనాలు తిరుగుతాయని, 426 బృందా లతోపాటు 1252 మంది ఆరోగ్య సిబ్బంది పనిచేస్తారన్నారు. మొదటి రోజు పల్స్ పోలి యో చుక్కలు వేసిన తర్వాత రెండు, మూడో రోజూ ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయాలన్నారు. హై రిస్క్ ఏరియాల్లో, గుడిసెలు, ఇటుక బట్టీలు, నూతన భవనాలు నిర్మిస్తున్న ఏరియాల్లో పిల్లలను గుర్తించి పల్స్ పోలియో చుక్కలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి స్వర్ణకుమారి, షాద్‌నగర్ డివిజన్‌లోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఫార్మసిస్టులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మానసిక ఆందోళనకు గురికావద్దు

**జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్**

వికారాబాద్, ఫిబ్రవరి 29 : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మానసిక ఆందోళనకు గురికావొద్దని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్ సూచించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ హెల్ప్ లైన్ నంబర్లను ప్రదర్శించాలని.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రిన్సిపల్ సెక్రటరీ ఎడ్యుకేషన్, తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ ఇచ్చిన సూచనలను ప్రభుత్వ, ప్రభుత్వరంగ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాటించాలని తెలిపారు. పరీక్షల ఒత్తిడికి లోనయ్యే విద్యార్థులు టెలిమానస్/తెలంగాణ హెల్ప్ లైన్ నంబర్-14416కు ఫోన్ చేసి మా నసిక వైద్య నిపుణుల ద్వారా తగు సూచనలు పొంది ఆందోళన చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## రాచకొండ కమిషనరేట్ పరిధిలో పలువురు సీఐల బదిలీ

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 29 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాచకొండ కమిషనర్‌రేట్ పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ రాచకొండ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇబ్రహీంపట్నం సీఐ సైదిరెడ్డి సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా.. అతడి స్థానంలో పహాడీషరీఫ్ సీఐగా ఉన్న సీఐ సత్యనారాయణ విధులు నిర్వహించనున్నారు. హైదరాబద్ గ్రీన్ ఫార్మాసిటి సీఐ నాగరాజు జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా.. అతడి స్థానంలో రాజేశ్ విధులు నిర్వహించనున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అబ్దుల్లాపూర్‌మెట్ సీఐగా అంజిరెడ్డి, ఎల్‌బీనగర్ సీఐగా రామాంజనేయులు, చౌటుప్పల్ సీఐగా సీతారామ్, వనస్థలిపురం సీఐగా అశోక్‌రెడ్డి, ఎల్బీనగర్ ట్రాఫిక్ సీఐగా జగదీశ్, ఉప్పల్ సీఐగా రమేశ్, సరూర్‌నగర్ సీఐగా సైదిరెడ్డి, కుషాయిగూడ సీఐగా వీరస్వామి, చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐగా సీతారామ్, వనస్థలిపురం ట్రాఫిక్ సీఐగా వెంకటేశ్వర్లు, నేరేడ్‌మెట్ సీఐగా శ్రీనివాస్‌రెడ్డి నూతన సీఐలుగా ఉద్యోగ బాధ్యతలను చేపట్టనున్నారు.

# కట్టుకున్నోడే కడతేర్చాడు..

- భార్యను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నం
- భర్తను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

నందిగామ, ఫిబ్రవరి 29 : మద్యం మత్తులో భార్యను కొట్టి చంపిన ఘటన మండల పరిధిలోని బుగ్గోనిగూడ గ్రామంలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. బుగ్గోనిగూడకు చెందిన ఎం.నరేశ్ షాబాద్ మండలం కుర్వగూడకు చెందిన మాధవిని 2020లో వివాహం చేసుకున్నాడు. వీరికి ఏడాదిన్నర బాబు ఉన్నాడు. కొన్ని రోజులుగా నరేశ్ మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 24న మాధవి పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్దల సమక్షంలో మాట్లాడి 27న తిరిగి బుగ్గోనిగూడకు వచ్చారు. 28న రాత్రి తాగి వచ్చి భార్యతో గొడవపెట్టుకుని కొట్టి చంపాడు. ఆ తర్వాత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించేందుకు యత్నించాడు. బంధువులు మాధవి మృతదేహంపై గాయాలను చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నరేశ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా చంపినట్లు ఒప్పుకున్నాడు. మృతురాలి సోదరి సంగీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

## వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 29 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలతో పాటు అన్ని బీఎస్సీ కోర్సుల రివాల్యుయేషన్ ఫలితాలను సైతం విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లి పెద్ద చెరువు సమీపంలో వెలసిన అక్రమ నిర్మాణాలను ఇరిగేషన్, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు గురువారం కూల్చివేశారు. గోపన్‌పల్లి పెద్దచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ప్రాంతాల్లో వెలసిన పలు అక్రమ నిర్మాణాలను ఈ సందర్భంగా జేసీబీ సహాయంతో కూల్చివేశారు. అక్రమంగా వెలసిన 3 గదులు, 6 తాత్కాలిక నిర్మాణాలు(షెడ్స్), నిర్మాణంలో ఉన్న ఓ బిల్డింగ్ గోడలను సిబ్బంది కూల్చివేశారు. ఈ కూల్చివేతలను అడ్డుకుంటూ పలువురు ఆక్రమణదారులు అధికారులతో వాగ్వాదానికి దిగడంతో పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. కూల్చివేతల్లో ఇరిగేషన్ ఏఈ నాగరాజు, శేరిలింగంపల్లి ఎమ్మార్వో రాము, శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.